వెన్నెలవాన

డాక్టర్ ఆలూరి విజయలక్ష్మి

ఆమె కళ్ళల్లో వెలుగు వెన్నెల జల్లులు జల్లులుగా కురుస్తూంది. ఆమె అధరాల కొసన అమృతఝురి తుంపర్లు తుంపర్లుగా విరుగుతూంది. ఆమె హృదయంలో ఆశల వెల్లువ ఎగిసి ఎగిసి దూకుతూంది.

ఎంత చల్లటిమాట చెప్పారు డాక్టర్! దుర్భరంగా వున్న యీ బ్రతుకునెలా యీడవడమా అని తను నిస్పృహ చెందనక్ఖర్లేదిక. గమ్యంలేని తన ప్రయాణానికో లక్ష్యం ఏర్పడింది. తన శాపగ్రస్త జీవితానికి విముక్తి లభిస్తుంది. ఆశల కిరణాల దారులవెంట పరుగెత్తుతూంది హేమంతి హృదయం.

మరుక్షణం బ్రతుకులో జరిగిపోయిన చేదు సంఘటనలన్నీ కళ్ళ ముందు కదులుతున్నాయి. మచ్చల చీకటిలా వున్న తన గత జీవితం వికృతంగా నాట్యం చేస్తూంది. బలవంతంగా నెట్టివేస్తున్నా కదలక విజృంభిస్తున్నాయి ఆలోచనలు.

*

అనంత చైతన్యం, అవధులులేని ఉత్సాహం, రంగురంగుల స్వప్నాలు....వీటి రూపుదాల్చిన ఆకృతి ఇంటర్మీడియట్ ఫస్ట్‌క్లాస్‌లో పాసయిన హేమంతి.

కూతురి చేతిలో మెడికల్ కాలేజి అప్లికేషన్ చూచి ప్రపంచంలో ఎనిమిదో వింతని చూస్తున్నట్లు చూచాడామె తండ్రి. "ఏమిటి నాన్నా అలా చూస్తున్నారు? నేను మెడిసిన్‌కి అప్లై చేస్తాను. నాకు సీటు తప్పకుండా వస్తుంది" ఆశగా తండ్రి వంక చూచింది హేమంతి. సీతాపతి నిశితంగా కూతురి కళ్ళల్లోకి ఒకసారి చూచి, దీర్ఘంగా నిట్టూర్చి చూపులు తిప్పుకున్నాడు. అతని ధోరణి చూచి అసహనంగా చలించాయి హేమంతి కళ్ళు.

"అమ్మా! నేనోమాట చెప్తాను. కోపం తెచ్చుకోకుండా వింటావా?" యీ నాందీ ప్రస్తావనంతా దేనికో అర్థంకాక తండ్రి వంక విసుగ్గా చూచింది హేమంతి.

"అందర్లోకి పెద్దవాడు, మగవాడు, అన్నయ్యని ఇంజనీరింగ్ చదివించుదామని వుందమ్మా నాకు, మీ అమ్మకు."

"మంచిదే. చదివించండి. అన్నయ్య ఇంజనీరింగ్ చదివితే నేను మెడిసిన్ చదవగూడదనే రూలేమైనా వుందా?" చురుగ్గా చూచింది హేమంతి.

"అన్నయ్యకి వచ్చిన మార్కులకి వాడికి మెరిట్ సీటు రాదు. డొనేషన్ కాలేజీలో చేర్పిం

చాలి. డొనేషన్‌కి డబ్బు, ఆ తరువాత బోలెడన్ని ఖర్చులు. వాటికి నీకూ కూడ డబ్బు పంపాలంటే మనమందుకు తూగగలమంటావా?'' నిప్పురవ్వలు చిటపటమంటున్నాయి హేమంతి హృదయంలో. అత్తెసరు మార్కులతో గండం గడిచి బయటపడ్డ అన్నయ్య మగవాడు కాబట్టి వాడికి డొనేషన్ కట్టి మరీ చదివిస్తారు. పవిత్ర భారతదేశంలో పుట్టిన ఆడపిల్ల....తన కోరిక నీటిబుడగలా పేలి పోవలసిందే.

"మెడిసిన్ చదివినా, మరో చదువు చదివినా కట్నం నెత్తిమీద పెట్టందే నీ పెళ్ళి చెయ్యగలమా? గంతకుతగ్గ బొంత ఎవర్నో ఒకరిని చూచి ముడిపెట్టేసి మా బరువు దింపుకుంటాం. పెద్ద చదువులకి, వేల కట్నాలకి ఎక్కడి నుంచి తెస్తాం?'' హేమంతి తల్లి అన్నపూర్ణ అందుకుంది. 'ఆడపిల్ల! బరువు! యిలా అనుకోవ డానికెందుకు సిగ్గుపడడం లేదీ మనుషులంతా?' హేమంతి హృదయం భగభగమంటూంది.

హేమంతి ఎంతగా వాదించినా, ఏడ్చినా, నిరాహారదీక్ష బూనినా ఆమె కోరిక ఫలించలేదు. స్నేహితురాళ్ళంతా పై చదువులకు వెళ్ళిపోయారు. తనొక్కతి ఏ తలకు మాసిన వాడి దౌర్భాగ్యపు దయైనా తన మీద ప్రసరించకపోతుందా అని ఎదురుచూస్తూ కూర్చోవాలి.

రెండు నెలలపాటు యింట్లో కూర్చునేసరికి ఒంటి మీద తేళ్లూ జెఱ్ఱులూ పాకినట్లయింది హేమంతికి. నెమ్మదిగా టైపు క్లాసులకి వెళ్ళ సాగింది. వచ్చిన ఒకటి రెండు సంబంధాలు డబ్బాశ తీరక ఏవేవో కుంటి సాకులతో వెనిగిపోవడంతో హేమంతిని వారించడానికి ధైర్యం చాలలేదు సీతాపతికి, అన్నపూర్ణకు.

క్రమేపీ హేమంతి హృదయంలో వున్న కల్లోలపు ఉధృతం తగ్గింది. అన్నయ్య మీది అసూయ, అమ్మా నాన్నల మీది కోపం తగ్గింది. ప్రస్తుతం వున్న పరిస్థితుల కనుగుణంగా వాళ్ళు ప్రవర్తిస్తున్నారు. పరిస్థితులు మారకుండా వాళ్ళని తప్పుపట్టి ప్రయోజనం లేదనుకుని సమాధాన పడింది.

సరిగ్గా ఆ సమయంలో గుండెపోటు వచ్చి కన్నుమూసాడు సీతాపతి. చుక్కానిలేని నావలా అయింది కుటుంబం. ఇంజనీరింగ్‌లో వున్న అన్న, ఇంటర్మీడియట్‌కొచ్చిన తమ్ముడు, టెన్త్‌లో వున్న చెల్లి....ఒక్కరూ ఆర్జించే స్థాయికి రాలేదు. వుంటున్న చిన్న యిల్లు, తండ్రి పోయాక వచ్చిన కొద్ది డబ్బు వీటితో సంసారమెలా గడుస్తుందో, చదువులెలా సాగుతాయో అగమ్య గోచరంగా వుంది హేమంతికి.

జీవితంలో తను కోరుకునేది వేరు. దక్కుతూంది వేరు. డాక్టరవాలని అవలేకపోయింది. తన తల్లి తండ్రులు కోరుకున్నట్లుగా భర్త, పిల్లలతో ముచ్చటయిన సంసారానికీ నోచుకోలేకపోయింది. స్నేహితురాలి తండ్రి దయవల్ల ఒక చిన్న జాబ్ దొరికింది. ఇష్టంలేకున్నా గత్యంతరంలేక అందులో యిమిడిపోయింది. తెలివితేటలున్నా పెద్ద చదువు చదువుకోలేకపోయిన తనకంతే అర్హతుంది అని సరిపెట్టుకుంది.

చన్నీళ్ళకు వేన్నీళ్ళు తోడయాయి. హేమంతి సంపాదన కుటుంబం ఏ ఒడిదుడుకులూ లేకుండా సాఫీగా జరిగిపోవడానికి దోహదం చేసింది.

ఎలాంటి కదలికా లేకుండా, యంత్రవతుగా సాగిపోతున్న హేమంతి జీవితంలోకి ప్రవేశించాడు బోసు. ఆమెలో నిద్రించిన స్వప్నాలు మళ్ళీ మేల్కొన్నాయి. ఆమె కళ్ళు నీలిమబ్బుల పరదాల మధ్య మెరిసే విద్యుల్లతల్లా తళుక్కుమంటున్నాయి. ఆమె హృదయం తన భావి జీవితపు రసరమ్య కావ్యాన్ని రచిస్తూంది.

హేమంతి పనిచేసే ఆఫీసులో గుమాస్తా బోసు. ఆమె ఉద్యోగంలో చేరిన కొద్దిరోజులకే బోసు ఆమెలో తియ్యటి ఊహల్ని రేపగలిగాడు. మాటాడని మల్లెమొగ్గలా ఒదిగి తన పని తాను చూచుకుని వెళ్ళిపోయే హేమంతిని కవ్వించి నవ్వించసాగాడు. అతి కొద్ది కాలంలోనే ఆమె తన సుఖానికీ, దుఃఖానికీ కేంద్రం బోసు అని భావించేంత సన్నిహితమయాడు.

"గొప్ప చిక్కొచ్చిపడింది హేమా!'' సీరియస్‌గా అన్నాడు బోసు. అంతవరకు జోక్స్ పేల్చి నవ్విస్తూ అంత హఠాత్తుగా అంత గంభీర ముద్ర ఎందుకు దాల్చాడో తెలియక ఆశ్చర్యంగా చూచింది హేమంతి. అతని దృష్టి క్రోటన్ పొదల కావల బంతాట ఆడుకుంటున్న పిల్లల మీదుంది. పార్కంతా సందడి సందడిగా వుంది.

"ఏమిటా చిక్కు బోసూ?'' ఆతృతగా అడిగింది హేమంతి.

"నీకు చెప్పినా అర్థం కాదులే." నీరసంగా జవాబిచ్చాడు బోసు. అతనికొచ్చిన చిక్కేమిటో నన్న ఆదుర్దా, తనకు అర్థం కాదన్నందుకు రోషం కలిగాయి హేమంతికి.

"పోన్లే చెప్తాను. అర్థం చేసుకుందుకు ప్రయత్నించు." దయతలచి చెపుతున్నట్లు పోజ్ చేస్తున్న బోసుని కళ్ళ కొసల్లోంచి చూచి మూతి విరిచింది హేమంతి.

"మా పెరట్లో రాలుతున్న సన్నజాజులు ఉస్సురని నిట్టూరుస్తున్నాయి. నా గది కిటికీలో గుండా తొంగిచూచే చందురుడు నేనొంటిగా వుండడం చూచి ఎగతాళిగా నవ్వి వెళ్ళిపోతున్నాడు. గుసగుసలాడుకుంటూ నడిచివచ్చే గాలి నేను మౌనంగా కూర్చోవడం చూచి జాలిగా వెనక్కు మళ్ళుతూంది.'' అతని కళ్ళల్లో చెలరేగుతున్న చిలిపితనం వంక కోపంగా చూచింది హేమంతి.

"చాల్చాలు. పైత్యం బాగా ముదిరిపోయింది." హేమంతి వారింపు విని నవ్వాడు బోసు.

"వాళ్ళ మూగప్రశ్నలకు జవాబివ్వడం మాని నాది పైత్యమంటావా? అన్యాయం.''

"పద. పద. లాభం లేదింక. మా యింటి ప్రక్క భూత, ప్రేత, శాకినీ, ఢాకినీ డాక్టరొకాయన వున్నారు. ఆయన ప్రిస్క్రిప్షన్ తీసుకోవాల్సిందే ననిపిస్తూంది నిన్ను చూస్తూంటే'' గబుక్కున లేవబోయింది హేమంతి. ఆమె పయిటచెంగు అందుకుని కూర్చోబెట్టాడు బోసు. చుట్టూ పరచుకుంటున్న చిరుచీకట్లతనికా ధైర్యాన్నిచ్చాయి.

"హేమూ! మీ అమ్మగారితోను, అన్నయ్యతోను మాట్లాడడానికెప్పుడు రమ్మంటావు? యింక నిన్ను విడిచి ఒక్క క్షణం కూడా వుండలేనని పిస్తూంది.'' అతని మాటల్లోని నిజాయితీని, ప్రేమను హేమంతి హృదయం గుర్తించింది. కాని.... అన్నయ్య చదువింకా అవలేదు. తమ్ముడు చురుకైనవాడు. తనెలాగూ డాక్టరవలేకపోయింది. వాడినైనా డాక్టర్ని చేయాలి. అన్నయ్య చదువయి పోయిందంటే విష్ణు, వందన చదువుల్ని తనే చూసుకుంటాడు. అప్పటివరకు తనకీ బంధాల్నుంచి విముక్తిలేదు.

హేమంతి చెప్పింది అంతగా రుచించలేదు బోసుకి. యీ సౌందర్యాన్నిలా ముందు పెట్టుకుని మరో సంవత్సరం పాటు దూరంగా వుండగలగడం అసంభవమనిపించింది. హేమ తనని దూరంగా వుంచుతున్నందుకు ఉక్రోషమొచ్చినా ఆలోచిస్తే ఆమె నమ్మకాలు, రూల్సంటే గౌరవమే కలిగేది. ఒక్క సంవత్సరం! ఎంతలో తిరిగొస్తుంది! అని సమాధానపడ్డాడు.

అవాంతరమేమీ లేకుండా సంవత్సరం తిరిగే సరికి జగదీష్ చదువయిపోయింది. కనపడిన జాబ్స్ కన్నిటికీ అప్లికేషన్స్ పెట్టినా ఒక్కటీ రాలేదు. ఈలోపు 'ఇంజనీరయాక ఈ రోజు కాకపోతే రేపైనా ఉద్యోగం రాకపోతుందా' అన్న ఆశతో ఆడపిల్లల తల్లిదండ్రులు వేట మొదలుపెట్టారు. ఒక శుభముహూర్తాన ఒక మంచి సంబంధాన్ని ఖాయం చేసుకోనూ చేసుకున్నారు.

అన్న పెళ్ళయి అతని మకాం అత్తవారింటికి కేరుకున్నాకగాని హేమంతికి తనెంతలోతుగా యీ బంధాల్లో చిక్కుకుపోతూందో అర్థం కాలేదు. అర్థం చేసుకున్నాక కూడా విదుల్చుకుని బైటకు వెళ్ళలేక పోయింది. అంతవరకు ఓపిగ్గా ఎదురు చూచిన బోసు యింక నిగ్రహించుకోలేకపోయాడు.

"హేమూ! నీ మంచితనాన్ని మీవాళ్ళెంత నేర్పుగా వాడుకుంటున్నారో నువ్వు గుర్తించడం లేదు." ఆలోచిస్తూంది హేమంతి. 'ఇంటికి పెద్ద వాడు, మగవాడు' తన చెల్లికి అర్హమైన అవకాశాన్ని దోచుకున్నాడొకనాడు. అది మనసులో పెట్టుకోకుండా అతను పొందిన అవకాశం సాఫల్యం చెందేందుకు తన సాయశక్తులా సహాయపడింది. యిప్పుడవసరం తీరాక తేలిగ్గా చేతులు దులుపుకుని వెళ్ళిపోయాడు. యీ భారాన్ని తన బలహీనపు చేతుల్లో వదిలి నిర్దయగా తమని విడిచిపోయాడు. శక్తిలేనట్లు చూస్తూ కూర్చున్న హేమంతి భుజం మీద చెయ్యేసి అనునయంగా తట్టాడు బోసు.

"హేమూ! నీ జీతం గురించి నేనెప్పుడూ అడగను. ఇదివరకటిలానే మీవాళ్ళకివ్వు. నీ ఆలోచన మాని నిశ్చింతగా నా యింటికి రా." బోసు ఆప్యాయతకు కరిగిపోయింది హేమంతి. తనకు కావలసినట్లుగా అతను సమస్యాపరిష్కారాన్ని చూపినందుకు అతని వంక కృతజ్ఞతగా, ఆరాధనగా చూచింది.

కాని బోసు మాటల్ని హేమంతి విశ్వసించి నట్లుగా అన్నపూర్ణ, విష్ణు, వందన నమ్మలేదు. కూతురు కోరుకున్నవాడు, ఆమెను కళ్ళల్లో పెట్టుకు చూచేవాడు దొరికినందుకు ఆనందిస్తున్న అన్నపూర్ణకి ఆ ఆనందం కంటే అజ్ఞాత భయాలే ఎక్కువగా వున్నాయి. యివాళ హేమను పెళ్ళి చేసుకునేదాక నమ్మకంగా కబుర్లు చెప్పి తరువాత 'ఠక్! నయాపైసా ఎవరికీ యివ్వడానికి వీల్లేద'ని ఆంక్షలుపెడితే ఏం చెయ్యగలుగుతుంది? భర్తని కాదని సంసారాన్ని కూలదోసుకుంటుందా? అప్పుడు తమనే ఎడంగా వుంచదా? హేమ అలా ప్రవర్తించిన నాడు తమ గతేమిటి? చిన్నవాళ్ళిద్దరి బ్రతుకులు నట్టేట్లో కలిసిపోవా? ఐనా యిప్పుడు హేమ వయసెంతని? ఇంకా రెండు మూడేళ్ళదాకా దాని పెళ్ళికి తొందరేమిటి? అబ్బాయికి ఉద్యోగమొచ్చిం దంటే లక్షణమైన సంబంధం తెస్తాడు చెల్లెలికి.

తల్లి అభ్యంతరం విని నిర్ఘాంతపోయింది హేమంతి. ఆమె మనసులోని భయాల్ని, ఆందో ళనల్ని చూచాయగా గుర్తించింది. ఆమె ప్రవ ర్తనకి కోపం కంటే జాలి, బాధ కలిగాయి. విష్ణు, వందనదీనంగా తనవంక చూస్తూంటే, చిగురు టాకుల్లా వాళ్ళ కళ్ళు భయంతో చలిస్తూంటే తట్టుకోలేకపోయిన హేమంతి వాళ్ళ సందేహాలు సహేతుకమైనవేనా అని ఆలోచింపసాగింది. ఆలో చించి, ఆలోచించి ఒక బలహీన క్షణంలో తల్లికా భయముండడం సహజమేననే నిర్ణయానికొచ్చింది. అమ్మ అన్నట్లుగా బోసుకి తనకంటే తన సంపాదన ముఖ్యమయే సమయమొస్తే తను తట్టుకుని బ్రతకలేదు. తన వాళ్ళూ నిస్సహాయంగా దిక్కు తోచక నిలబడిపోవాలి. తరువాత తన అదృష్టమెలా వుంటే అలా జరుగుతుంది. ఇప్పుడు మాత్రం తను మధ్యదారిలో వాళ్ళని ఒదిలేసి బోసు జీవితం లోకి నిశ్చింతగా వెళ్ళిపోలేదు.

హేమంతి నిర్ణయం విని హతాశుడయాడు బోసు. ఆమెను చూస్తూంటే జాలిగా వుంది. ఉవ్వెత్తున కోపమొస్తూంది. తనింతగా హృదయం విప్పి చెప్పినా, నిష్కల్మషంగా ఆమెను తన జీవితంలోకి ఆహ్వానిస్తున్నా యింత మూర్ఖంగా ఆమె తనవాళ్ళ స్వార్థానికి బలవుతూండడం చూచి బాధపడ్డాడు. త్యాగానికి కూడ ఒక హద్దుంటుంది. తన బ్రతుకు గురించి ఒక్క పిసరు ఆలోచన కూడ లేకుండా తన అభ్యర్థనని త్రోసి రాజంటూంది. కనీసం తన ప్రేమైనా ఆమెని తన వైపుకు తిప్ప లేక పోయింది. తన సంపాదన గురించి అడగనని వాగ్దానం చేసినా హేమ తనని నమ్మకపోవడంతో అతనికి ఉక్రోషమొస్తూంది. ఆమె నుండి మనసు మరల్చుకోలేని తన అశక్తతకు కోపమొస్తూంది.

చైతన్యగీతంలా తన నలరించిన బోసు నిశ్శ బ్దంగా తన జీవితాన్నుంచి నిష్క్రమించడంతో నిర్జీవ ప్రతిమలా మారింది హేమంతి. బ్రతుకు మీద ఏ ఆశ, అనురక్తి లేకుండా నిరాసక్తంగా



బి. అనిత

రాజమండ్రి 'కళాదర్బార్' వారు అఖిలభారత స్థాయిలో గత సంవత్సరం నాట్య పోటీలు నిర్వహించారు. ఆ పోటీలలో ఎందరో పాల్గొన్నారు. అయితే ఆ పోటీలో బహుమతులు గెల్చుకున్నది మూడవ తరగతి చదువుతున్న ఒక చిన్నారి బాల అని తెలుసుకున్నప్పుడు ఆశ్చర్యం కలగడం సహజం. ఆ చిన్నారి పేరు బి. అనిత. ఆ పోటీలలో- కూచిపూడి నాట్యంలోనూ, జానపద నృత్యంలోనూ ప్రథమ బహుమతులు, భరతనాట్యంలో ద్వితీయ బహుమతి తెచ్చుకుని 1978 సంవత్సరపు 'నాట్య బాల' బిరుదాన్ని పొందింది అనిత.

అడవి బాపిరాజుగారి రచన – 'గంగిరెద్దు' జానపద శైలిలో నాట్య రూపంలో ప్రదర్శించడంలో ప్రత్యేకమైన పేరు సంపాయించింది అనిత. పలు బహుమతులు పొందింది. రాజమండ్రిలోని ఉమా నృత్య కళాశాలలో నాట్యం అభ్యసిస్తున్న అనితకి తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతైనా లభిస్తోంది.

రోజుల్ని వెళ్లబుచ్చుతూంది.

*

కాలం కుంటుకుంటూ నడుస్తూంది. విష్ణుకు మెడిసిన్‌లో సీటు రావడంతో అతనికే విధమైన లోటూ రాకుండా అన్నీ సమకూర్చాలని తాపత్రయ పడుతూంది హేమంతి.

తరచుగా బ్రతుకంటే విసుగ్గానూ, భయంగానూ వుంటూంది. జడప్రాయంగా వున్న యీ బ్రతుకుని భరించలేకపోతూంది హేమంతి. ఏదో విధమైన మార్పు రాందే ఊపిరి సలపదేమోనన్న భీతి కలుగుతూంది. జగదీష్‌కి ఉద్యోగం వచ్చిందన్న వార్త విని చిరుదీపంలా ఆశ వెలిగింది హేమంతిలో. ఇప్పుడైనా తనీమోనాటనీ నుంచి తప్పించుకోగల నేమోనని ఆశపడుతూంది.

కొడుకు ఉద్యోగపు వార్తని విని అన్నపూర్ణ పొంగిపోయింది. యింక తమ కష్టాలు గట్టెక్కుతాయి. యిప్పటిలా కూతురు రక్తాన్ని పిండుకుని తాగనఖ్ఖర్లేదు. ఎంత రాక్షసిలా ప్రవర్తించింది తను! తనంతట తాను వరుణ్ణి వెతికి సలక్షణంగా కూతురి పెళ్ళి జరిపించే భాగ్యానికెలాగూ నోచుకోలేదు. పైగా కోరివచ్చిన వాణ్ణుంచి అతి దారుణంగా విడదీసింది. వెనకాల యీ పిల్లలే లేకపోతే తరువాత తను నిరాధారంగా నిలబడిపోయినా సంతోషంగా కూతుర్ని ఆశీర్వదించి వుండేది. యింత అమానుషంగా ఆమె సౌభాగ్యాన్ని, సంతోషాన్ని కూలద్రోసి వుండేది కాదు.

అసలు మొదటినుంచి తను, వాళ్ళ నాన్నగారూ కలిసి దానికన్యాయమే చేసారు. అంత మంచి మార్కులు తెచ్చుకున్న దాన్ని చదివించకుండా మొగపిల్లాడేదో ఉద్ధరిస్తాడనే ఆశతో వాడిని చదివించారు. ఆడపిల్ల అని చిన్నబుచ్చాం దాన్ని, చివరకదే ఉద్ధరిస్తూంది. ఆ ఉద్ధరించడంలో తన బ్రతుకు కాలిపోతున్నా లెఖ్ఖ చెయ్యడం లేదు. కన్న తల్లే కనికరమనేది లేకుండా తననో మోడులా మారుస్తూంటే కిమ్మనకుండా భరిస్తూంది.

తల్లి హృదయం పశ్చాత్తాపంతో దగ్ధమవుతూందని హేమంతికి తెలియదు. తామాశించినట్లు అన్నయ్య అప్పుడప్పుడూ యింటికివచ్చి మంచీ చెడ్డా కనుక్కుంటున్నాడదే పదివేలు. ప్రయోజకుడై కుటుంబాన్ని ఆదుకుంటాడనుకున్న కొడుకు దూరమవడంతో అవమానంతో, దిగులుతో క్రుంగిపోతున్న అమ్మ కాస్త సంతోషంగా వుంటూంది. వందనకి చదువబ్బడం లేదు. పెళ్ళి చేసేద్దామని గొడవ చేస్తూందమ్మ.

వందన పెళ్ళి అనుకునేసరికి వందన కంటే పెద్దది తన పెళ్లవలేదని గుర్తొచ్చింది. తన పెళ్ళి అనే తలంపుతో ఆమెలో ఇదివరకులా ఉత్సాహం పరవళ్ళు తొక్కలేదు. మధురోహలు ఉక్కిరిబిక్కిరి చెయ్యలేదు. చెక్కిళ్ళు కందలేదు. కళ్ళు వాలిపోలేదు. నిర్లిప్తత, భరించలేని నిర్వేదం, అనంతమైన శూన్యం నిండి వున్నాయామె హృదయంలో. యీ శూన్యాన్ని పారద్రోలి, ఆత్మీయతతో తడిపి, ప్రేమ కుసుమాల్ని వికసింపజేయగల వ్యక్తి మళ్ళీ లభిస్తాడా! బోసుని మరిచిపోయి మరో వ్యక్తి జీవితంలో లీనమవడం సాధ్యమవుతుందా!

*

అసాధ్యమనుకున్న దాన్ని సాధ్యం చేసుకోవడానికి ప్రయత్నిస్తూ కేశవరావుని పెళ్ళి చేసుకుంది హేమంతి. జగదీష్ పూనుకుని, బంబంధం కుదిర్చి, పెళ్ళి చేసినందుకు సంతోషించింది.

కాని ఆ సంతోషం పొగమంచులా యిట్టే మాయమయింది. తొలిరేయి అనుభవంతో తను శూన్యంలో నుంచి నరకంలోకి వచ్చిపడ్డానని తెలుసుకుంది. తను బృందావన విహారాలు, స్వర్గ సౌఖ్యాలు ఆశించలేదు కాని ముళ్లకంచె మీద, కత్తుల బోనుల మధ్య పడతాననీ అనుకోలేదు.

తనలోని సంకోచం తొలిగేవరకు సున్నితమైన స్పర్శ, లలితమైన లాలింపు, రసోద్వేగభరితమైన సంభాషణ భర్త నుంచి ఆశించిన హేమంతి కేశవరావు జంతు ప్రవర్తనకు తట్టుకోలేకపోయింది. యీ మనిషికి తన స్పందన, భావాలు, ఆనందం గురించి పట్టింపులేదు, యితనికి కావలసింది తన శరీరమని గుర్తించగానే అతనిస్పర్శ పరమజుగుప్సాకరంగా అనిపించింది హేమంతికి. అనురక్తితో జ్వలించి, జ్వలించి కరిగిపోవలసిన దేహం జుగుప్సతో ముడుచుకుపోయింది. కాంక్షతో అల్లుకుపోవలసిన ఆమె ప్రత్యణువు అసహ్యంతో ఎదురు తిరిగి తీవ్రంగా ప్రతిఘటిస్తూంది. ఐనా, మొదటి నుండి ఎంతటి బాధనీ నోరు విప్పకుండా భరించే హేమంతి యీసారీ ఓర్పు వహించింది.

మరుసటి రోజు ఉదయం తన ఒంటి మీది వాతల్ని, గీటుల్ని, పంటి గుర్తుల్ని, కమిలిపోయిన భాగాల్ని చూసుకుంటూంటే అప్రయత్నంగా బోసు గుర్తుకొచ్చాడు హేమంతికి. తన చేతినెంత అపురూపంగా పట్టుకునేవాడతను! కోమలమైన పుష్పాన్ని పట్టుకున్నట్లుగా, గట్టిగా పట్టుకుంటే ఎక్కడ కందిపోతుందోనన్నట్లుగా సున్నితంగా అందుకునేవాడు. తన దగ్గరున్న ప్రతిక్షణం తనెక్కడ నొచ్చుకుంటుందోనన్న భయంతో తనకు అణుమాత్రం బాధ కూడా కలగగూడదన్నట్లు ప్రవర్తించేవాడు.

"మీ అబ్బాయిలంతా యింతే. స్నేహితుడుగా ఒకమ్మాయి ఆనందం కోసం తహతహలాడే మీరు భర్తగా ఆమె కన్నీటికి కారకులౌతారు." ఒక రోజతన్ని ఉడికించడానికి తమాషాగా అంది తను.

"నీకంట కన్నీరొలికించడమా? హేమూ! నిన్ను నా గుండెల్లో పెట్టుకుంటాను. నా రక్తంలో నిన్ను కలిపేసుకుంటాను." అతని మాటలకు ఫక్కున నవ్వింది తను.

చివ్వున నీళ్ళుబికాయి హేమంతి కళ్ళల్లో. యీ జ్ఞాపకాలే తనకు మిగిలింది. ప్రతి రాత్రీ ఒక నరకాన్ని చూస్తూ, పశుతుల్యుడైన భర్తతో జీవితాంతం కలిసి బ్రతకాలి. భార్యని హింసించడంలో ఆనందాన్ననుభవిస్తూ, అదే శృంగారమని భావించే శాడిస్ట్‌తో తను సంసారం చెయ్యాలి. రెడీగా, ఖర్చు లేకుండా తన యిష్టం వచ్చినట్లు ఆడుకుంటానికి, అనుభవించడానికి మాత్రమే భార్య అనుకునే యీ తుచ్ఛుడితో తనిక మీదట కలిసి బ్రతకాలనే ఊహతో ఒణికిపోయింది హేమంతి.

'అన్నయ్యా! నీకు నేనేం అపకారం చేసానని యీ పులికి మేతగా వేసావు? నాకు దగ్గర స్నేహితుడు, నేను చెప్పినట్లు వింటాడు, మంచి జాబ్‌లో వున్నాడు, వెనక బాదరబందీ లేదు, నువ్వు సుఖపడతావని నాలో ఆశలు రేపావు. నీ చేతుల్తో నా పెళ్ళి చేస్తున్నావని పొంగిపోయానే, యిన్నాళ్ళకు చెల్లిని ఆదరంగా చూస్తున్నావని మురిసిపోయానే, నా పొంగుని, మురిపాన్ని కన్నీళ్ళలో కలపడానికి నీకు మనసెలా ఒప్పిందన్నయ్యా? నా బాధను మరొకరితో చెప్పుకోలేని అమాయకపు ప్రాణినని, జీవితం ఎలా వున్నా మౌనంగా అనుభవించడమే తప్ప ప్రతిఘటించి నాకు కావలిసినట్లుగా మలుపుకునే సాహసం లేనిదాన్నని నీకు తెలుసుకదా, చూస్తూ చూస్తూ యీ గంధకపు మంటల మధ్యకు ఎలా తోయగలిగావు?'....... లోలోనే కుమిలి కుమిలి ఏడుస్తూంది హేమంతి. పైకి బావురుమని ఏడ్చి హృదయంలోని భారాన్ని దించుకుందామని ఎంతో వుంది; కాని ఏవో సాంప్రదాయాలు, నీతిపట్టికలు

ఆమె కంఠాన్ని నొక్కేస్తున్నాయి.

గుమ్మాలకు కట్టిన పచ్చతోరణాలింకా వాడనే లేదు. హేమంతి మెడలోని పసుపుతాడు ఛాయ తరగనే లేదు. హేమంతి డాక్టర్ దగ్గరికి వెళ్ళక తప్పనిసరి పరిస్థితి వచ్చింది. ప్రాణం పోతుందేమో నన్నంతబాధ శరీరాన్ని మెలిపెడుతూంది.

డాక్టర్ చెప్పింది విన్నాక తన శరీరాన్ని చూచుకుంటే అసహ్యంగా వుంది. ఏ అగ్నిప్రవేశం చేస్తే తన శరీరం పవిత్రమవుతుంది? ఏ లోషన్లలో మునిగితే తన శరీరాన్నంటిన యీ మాలిన్యం వదిలిపోతుంది? ఎన్ని ఇంజక్షన్లు పొడిస్తే తన రక్తం శోధితమౌతుంది? ఏ దేవతల్ని వేడుకుంటే తనకీ బాధల్నుంచీ విముక్తి కలుగుతుంది?

"ఈ ఇంజక్షన్లు, టాబ్లెట్స్ నువ్వు, మీవారు ఇద్దరూ వాడాలమ్మా! అందంగా, అమాయకంగా వున్న హేమంతి వంక జాలిగా, దయగా చూచింది డాక్టరు....మందుల చీటీ అందిస్తున్న డాక్టర్ అభయహస్తమిస్తున్న దేవతలా అనిపించి చేతులు జోడించింది హేమంతి.

"మీవారి కాళ్ళకు సంకెళ్ళు వేసి తిరుగుడు తగ్గేలా చూస్తేతప్ప నీకీ బాధలు తప్పవు. కొంచెం ఘాటు దోసిచ్చి కంట్రోల్‌లో పెట్టు" సిగ్గుతో వంగిపోయింది హేమంతి తల. డాక్టర్ ముఖం వంక సూటిగా చూడలేకపోయింది. తప్పు చేసిన దానిలా తల వంచుకుని గబగబ బైటకు వచ్చింది.

మందులు కొని తెచ్చి డాక్టర్ చెప్పిన విషయాల్ని భర్తతో చెప్పింది హేమంతి. జవాబుగా అతని ఆరోపణని విని నిర్విణ్ణురాలయింది. తన ప్రవర్తన కేమాత్రం సిగ్గుపడకుండా, ఎదురుతిరిగి హేమంతినే పతితగా చిత్రించి నిందలు మోపుతూంటే వున్న పళాన చచ్చిపోవాలనే కోరిక కలిగిందామెకు. యింత దౌర్భాగ్యుడు, నీచుడు తనకు భర్తగా దొరికాడా? యిలాంటి తుచ్ఛుడికా ప్రతి రాత్రి తన శరీరాన్ని అప్పగిస్తూంది? యీ పిశాచమా తన బిడ్డలకు తండ్రవేది?. ..ఆమె కళ్ళల్లో కనిపిస్తున్న తిరస్కారం, ఏవగింపు, అసహ్యం కలిసి అగ్నిగా మార్పు చెందగలిగితే అది కేశవరావుని క్షణంలో దగ్ధం చేయగలిగి వుండేది. అలా మార్పుచెందే అవకాశం లేదు కాబట్టే కేశవరావులాంటి పాపిష్ఠి మనుషులింకా సుఖంగా వర్థిల్లుతూనే వున్నారు.

తమకు నచ్చిన రీతిలో బ్రతుకును మలచుకునే తెగింపు లేనివాళ్ళకు చచ్చే సాహసం వుండదు. ఎన్నోసార్లీ దౌర్భాగ్యపు బ్రతుకు బ్రతకలేను, యీ బ్రతుకుకంటే చావు నయమనుకున్న హేమంతి ఆత్మహత్య చేసుకోలేదు. కష్టాల్ని ఓర్చుకుంటూ బ్రతుకుతూనే వుంది. తనెందుకు ఓర్చుకోవాలి? బలవంతాన యింత గరళాన్నెందుకు మింగాలి? తనంతట తాను బ్రతకడానికి ధైర్యమిచ్చే సంపాదన వుంది. భర్త అంత, మేకిపండులాంటి యీ సంసారమూ వదులుకుని బైటకు వెళ్ళిపోయినా దివ్యంగా బ్రతకగలదు తను. ఈయన అంటించే జబ్బుల్తో తన శరీరం కుళ్ళిపోతూంది. యింక హృదయమా ఎప్పుడో చచ్చిపోయింది. మరి ఏ సుఖాన్ని, సంతోషాన్ని ఆశించి యీ కప్పుకింద యితన్తో కాపురం చేస్తూంది!....ఆలోచించుకుంటూ, తర్కించుకుంటూ, తనకీ బందిఖానా నుంచి విముక్తి కలిగించే బలమైన సంఘటనేమైనా జరుగుతుందా అని ఎదురుచూస్తూంది.

హేమంతి ఎదురుచూచినట్లే బలమైన సంఘటన జరిగింది. కాని అది ఆమె ఆశించినట్లుగా భర్త బారి నుంచి రక్షించేది కాదు. భర్తతో శాశ్వతంగా కట్టిపడేయగలది; అనుక్షణం అతన్ని గుర్తుకు తెచ్చే అతని ప్రతిరూపం తన గర్భంలో ప్రాణం పోసుకుంటూందన్న భావన్న గగుర్పాటు కలిగించింది. భయంగా వుంది. అయిష్టంగా వుంది. సంతోషంగానూ వుంది.

తన మధుర స్వప్నాలన్నీ కరిగి కాలంలో కలిసిపోయాయి. తల్లి కావాలనే యీ ఒక్క కోరిక నెరవేరుతూంది. తన కడుపులో రూపు దిద్దుకుంటున్న యీ శిశువు తండ్రి ఎంత దుష్టుడు, దుర్మార్గుడయినా అవనీయ్, తన రక్తాన్ని కూడా పంచుకుని, నవమాసాలు తన దేహంలో పెరిగి బయటికి వచ్చే దీన్ని ప్రేమించాలి. దీనితోపాటు దీని తండ్రిని కూడా ప్రేమించలేకపోయినా కనీసం అసహ్యించుకోకుండా వుండాలి.

అసహ్యించుకోకుండా వుండాలని నిశ్చయం చేసుకున్న హేమంతి మెదడు మీద కోలుకోలేని దెబ్బ కొట్టాడు కేశవరావు. సంతోషాన్ని పెదాలకు పూసుకుని అతను తండ్రికాబోతున్నాడన్న శుభ వార్తను చెప్పింది. అతని ముఖం ఆనందంతో వెలిగిపోతుందని ఆశించిన హేమంతి అతని ముఖ కవళికల్ని ఆశ్చర్యంగా చూచింది. యితను మనిషేనా అసలు? సున్నితమైన భావాలేవీ యితనిలో వుండనే వుండవా? ఎంతటి కర్కోటకుడూ తండ్రి అవుతున్నానని తెలిస్తే సంతోషంగా, గర్వంగా చూస్తాడే, యితనేమిటిలా యింత క్రూరంగా, పగబట్టిన పన్నగంలా చూస్తున్నాడు?

అతని ముఖకవళికల్ని చూచి చకితయయిన హేమంతి అతని మాటలు వింటూ శిలలా నిలబడిపోయింది.

అతనికి పిల్లలు వద్దు. భార్యా అక్ఖర్లేదు. అతనికి కావలసింది ఆడది. ఆ ఆడది తన భార్య అయినా, మరొకరయినా అతనికి పట్టింపులేదు. తనదెంత హీనచరిత్రో ఎదుటివారిదీ అంతే హీనచరిత్ర అని గాఢంగా నమ్మే యితను తనకు పిల్లలక్ఖర్లేదనడంతో ఆగక హేమంతి గర్భంలో వున్న బిడ్డకు తండ్రి తనే అని ఋజువేమిటని ప్రశ్నించాడు. సమయం మించకముందే గర్భవిచ్ఛేదానికి ప్రయత్నించమని సలహా యిచ్చాడు. తనుమాత్రం ఏ బిడ్డకూ తండ్రిగా నిలవనని తెగేసి చెప్పాడు.

హేమంతి కళ్ళు నిప్పులు కక్కుతున్నాయి. పిడికిళ్ళు బిగుసుకుంటున్నాయి. అన్ని మాటల్ని నిర్లజ్జతో వదరుతున్న అతని కంఠాన్ని పట్టి నులమాలనే తీవ్రమైన ఉద్రేకమొస్తూంది. యీ యింటికి నిప్పంటించి వున్న పళాన అతన్ని సజీవ దహనం చెయ్యాలనే ఆవేశమొస్తూంది. అపరకాళిలా అతని మీద విరుచుకుపడి, చీల్చి రక్తాన్ని తాగి, ఎముకల్ని దండగా గుచ్చి మెళ్ళో వేసుకుని నాట్యం చెయ్యాలనిపిస్తూంది.

అతనిముందు మరొకక్షణం వుంటే అనుకున్నదంతా చేస్తానేమోనని భయమేసింది. యింత దౌర్భాగ్యపు బ్రతుకు బ్రతుకున్న యీ దురదృష్టవంతురాలికెందుకు జన్మనిచ్చావమ్మా అని అమ్మ ఒడిలో తలదూర్చి తనివిదీరా ఏడవాలనిపించింది. రెండు వీధులవతల వున్న పుట్టిల్లు ఎన్నో యోజనాల దూరంలో వున్నట్లనిపించింది.

తూలిపోతూ రిక్షా దిగిన హేమంతి లోపల తన గురించే తల్లి, అన్న ఘర్షణపడుతూండడం విని బయటే ఆగిపోయింది.

"నువ్వెలాగైనా హేమని ఎబార్షన్ చేయించుకోవడానికి ఒప్పించాలమ్మా? పిల్లలు పుట్టారంటే మరి పైసా విదల్చడిటు. తరువాత నీ యిష్టం." అన్నపూర్ణ మాట్లాడలేదు. కూతురు డబ్బివ్వకపోతే అన్న భయాన్ని కలిగించింది. హేమ పెళ్ళయాక కూడ తన సంపాదన తమకే పెడుతూంది. కొడుకు కబుర్లు తప్పితే క్రియకొచ్చేప్పటికి మొండి చెయ్యే చూపిస్తున్నాడు. వీడిని నమ్ముకుంటే గోదార్లో ముంచేస్తాడు. కాని....కన్న కూతుర్ని నువ్వు

తల్లివి కావద్దమ్మా అని ఎలా చెప్తుంది తను! నీ తల్లి స్వార్థం కోసం బిడ్డను బలివ్వమని ఎలా అడుగుతుంది తను?

"ఏమిటమ్మా ఆలోచిస్తున్నావు? హేమకు పిల్లలు పుట్టారంటే వాళ్ళని తనే పెంచి పెద్ద జేయాలి. కేశవరావు చచ్చినా అలాంటి భారాన్ని నెత్తిన పెట్టుకోడు. అసలు హేమ సంపాదన కొంతకాలం వరకైనా మనకవసరం. అలా అని కేశవరావుని ఒప్పించే యీ పెళ్ళి చేసాను. వాడు దరిద్రుడు, తిరుగుబోతు అని తెలిసి కూడ యీ సంబంధం కుదిర్చానంటే ఎందుకనుకున్నావు? హేమ సంపాదనని మనకి వదిలేస్తానని మాటిచ్చాడు గనకే యిలా చేసాను." హేమ గుండెపొరల్ని చీలుస్తున్నాడు జగదీష్. కేశవరావు అసలు స్వరూపం అన్నకు ముందే తెలుసా – తెలియదా అన్న సందేహం తీరిపోయింది.

"హేమని ఎలా ఒప్పిస్తావో నీ యిష్టం. తను ఒప్పుకోకపోతే బలవంతంగానైనా చేయించే ఉపాయం ఆలోచించాలి." హేమంతి వెన్ను భయంతో జలదరించింది. అయ్యో! ఎలా యింత మంది హంతకుల మధ్య బ్రతికేది? ఎలా యింత కాలుష్యంలో ఊపిరి పీల్చుకునేది!

ఇప్పుడు లోపలికి వెళ్ళిందంటే అమ్మ తనను ఎబార్షన్‌కి ఒప్పించడానికి ప్రయత్నిస్తుంది. అంత నైచ్యాన్ని తను చూడలేదు. అమ్మనింక 'అమ్మా!' అని పిలవలేదు. తెలిసి, తెలిసి యిన్ని దుర్మార్గపు ఊహలతో తననా పరమఛండాలుడికి అంటగట్టిన యీ దౌర్భాగ్యుడి నీడను కూడ తను భరించలేదు. వీడు తనకు అన్నయ్య కాదు, వాడు తన భర్తా కాదు. వీళ్ళ మధ్య వుంటే తన రక్తాన్ని త్రాగేస్తారు. తన మాంసాన్ని వండుకుని లొట్టలువేస్తూ తింటారు. ఉఁహూ. యిక్కడ వుండకూడదు. పారిపోవాలి. దూరంగా పారిపోవాలి.

వడివడిగా నడుస్తూంది హేమంతి. మధ్య మధ్యలో పిచ్చిదానిలా పరుగెత్తుతూంది. తనను, తన కడుపులో పెరుగుతున్న బిడ్డను రక్షించుకోవాలన్న దృఢ సంకల్పం ఆమె కాళ్ళకు శక్తినిస్తూంది. గమ్యం లేకుండా నడిచి నడిచి చివరికో యింటి ముందాగి తలుపు తట్టింది. తలుపు తెరిచి తెల్లబోయి చూస్తున్న బోసు చేతులమధ్య అచేతనంగా వాలిపోయిన హేమంతికి తనకు తెలియకుండానే సబ్‌కాన్షస్‌గా బోసు దగ్గరికి బయలుదేరానని తెలియదు.

"బోసూ! నాకూ నా బిడ్డకు కొన్నాళ్ళు రక్షణనివ్వు. అంతకంటే ఎక్కువ నిన్నేమీ కోరను." దీనంగా, జాలిగా వుంది హేమ స్వరం.

"హేమూ! నేనుండగా నీకేం భయం వద్దు. మనిద్దరి దురదృష్టం వల్ల జరిగిపోయిందేదో జరిగిపోయింది. యింక నిన్ను నా గుండెల్లో దాచుకుంటాను" అతని మాటలు విని వెక్కి వెక్కి ఏడ్చింది హేమంతి.

"చాలాసార్లు చనిపోవాలనుకుని కూడా తెగించలేకపోయాను. కాని యిప్పుడు నాకు చావాలనిపించడం లేదు బోసూ! బ్రతకాలనిపిస్తూంది. ధైర్యంగా బ్రతకాలనిపిస్తూంది. ఆ ధైర్యం తెచ్చుకోవడానికి నీ సహాయం కావాలి బోసూ!" బోసు చెయ్యి హేమంతి తలను ఆప్యాయంగా నిమురుతూంది.

హేమంతి నమ్మకాన్ని వమ్ముచేస్తూ డాక్టర్ ఆమెకు గర్భం కాదని, ఏ కారణం చేతో బహిష్ఠు రావడం ఆలస్యమయిందని నిర్ధారణగా చెప్పింది. ఒకవైపు గర్భం కానందుకు మనసు తేలికపడింది. కేశవరావు అంశ తనలో పెరగనందుకు ఆనందంగా వుంది. మరోవైపు తల్లికావాలనే కోరిక ఆమెలో గాఢంగా నాటుకుపోయింది.

అంతలోనే నిరాశ కారుమేఘంలా క్రమ్ముకుంటూంది. తను తల్లికావడమెలా సంభవం? తల్లి అవడం కోసం తను భర్త అని అనుకోవడానికి కూడా అసహ్యించుకునేవాడి దగ్గరకు తిరిగి వెళ్ళడమనేది అసంభవం. తల్లి అవడం కోసం పతితగా మారే ఊహను కూడా తను భరించలేదు. కాని, తల్లికావాలనే కోరిక వేగంతో ఊడలు దింపుకుంటూ మహావట వృక్షంలా పెరిగిపోతూంది.

తన కోరిక తీరడానికి ఒకే ఒక్క పరిష్కారం కనిపిస్తూంది. తను చట్టరీత్యా కేశవరావు నుండి విముక్తి పొంది పునర్వివాహం చేసుకోవాలి. పునర్వివాహమనుకోగానే తృళ్ళిపడింది హేమంతి. ఎంత పిచ్చికోరిక కోరుకుంటూంది తను! తనే దేశంలో బ్రతుకుతూందీ ఎంత త్వరగా మరిచిపోయింది! యీ దేశంలో పురుషులు తామెంత దరిద్రులు, అధములు, తిరుగుబోతులూ అయినా పరమ పతివ్రతల్ని, అనాఘ్రాత పుష్పాల్ని మాత్రమే పెళ్ళి చేసుకోవాలనుకుంటారని, తనలా భర్తని విడిచివచ్చిన ఆడదాన్ని అనుభవించడానికే తప్ప ఆదరించి, గౌరవస్థానాన్ని కల్పించడానికి ముందుకు రారని ఎలా మరిచిపోయింది తను? — తను పునర్వివాహం చేసుకోగలగడమనేది ఒట్టి భ్రమ, తన కలలన్నీ కల్లలు.

కల్లలు కావు నిజమంటూ ముందుకు వచ్చాడు బోసు.

"హేమూ! నువ్వు కోరుకుంటున్న కొత్త జీవితాన్ని నేనిస్తాను. నువ్వు నా బిడ్డలకు తల్లివవుతావు." దృఢంగా వున్న బోసు మాటల్ని వినగానే ఆశ జలపాతంలా దుమికింది హేమంతి హృదయంలో. తను వింటూంది నిజమేనా? బోసు తనకు కొత్త బ్రతుకునిస్తాడా? యీ దేశంలో మగవాళ్ళ గురించి పొరపాటుపడిందాతను? యింత విశాలహృదయులు, ఉదారులు, ప్రేమించే శక్తి వున్న మగవాళ్ళు కూడా గంజాయి వనంలో తులసి మొక్కల్లా వున్నారా?

"హేమూ! నువ్వు కాదన్నావన్న కోపం, నిన్ను మరిచిపోయి మరొకర్ని పెండ్లాడలేని అశక్తత నాకు పిచ్చెక్కించాయి. మనశ్శాంతిని వెదుక్కుంటూ నీకు చెప్పకుండా పారిపోయిన నేను నాకు మనశ్శాంతి లభించేది నీ సన్నిధిలోనేనని తెలిసివచ్చేప్పటికి సమయం మించిపోయింది. నీ కోసం ఎంత కాలమైనాసరే వేచివుందామని నిశ్చయం చేసుకుని వచ్చిన నాకు నేను బ్రతుకంతా వేచివున్నా నువ్వు నాకు దక్కనిస్థితిలో వున్నావని తెలిసాక లోకమంతా ఎడారిలా కనిపించింది. విధి మన జీవితాలతో యిష్టం వచ్చినట్లు ఆడుకుని యిప్పటికి అలిసిపోయి మనిద్దర్నీ కలిసి బ్రతకమంటూంది."

విధి అలిసిపోలేదు, యింకా ఆడుకుంటూనే వుందనిపించింది హేమంతికి డాక్టర్ చెప్పింది విన్నాక. పిల్లలంటే తనకున్న కోరికను గ్రహించి ఏవేవో పరీక్షలు చేసిన డాక్టర్ ఒక భరించలేని నిజాన్ని చెప్పారు. కేశవరావు దయవల్ల వచ్చిన జబ్బులతో హేమంతి గర్భాశయానికిరువైపులా వున్న అండవాహికలు బాగా దెబ్బతిన్నాయి. అండవాహికలు నార్మల్‌గా వుంటేగాని అండం, పురుషుడి వీర్యంలోని స్పెర్మ్ కలిసి పిండం ఏర్పడడాని కవకాశం లేదు. హేమంతికి శాశ్వతంగా తల్లయే యోగం లేదు.

జీవితం పదే పదే దొంగ దెబ్బలు కొట్టడంతో బాధపడే ఓపిక కూడా లేకపోయింది హేమంతికి. కాళ్ళు వచ్చిన పిండిబొమ్మలా డాక్టర్ దగ్గర సెలవు తీసుకుని యింటికి వచ్చింది.

బోసుకి నిజాన్నెలా చెప్పడం? తన మీది ప్రేమతో, జాలితో, నిండు మనసుతో తన జీవితం

398

1. మన దేశపు జాతీయ పుష్పం ఏదో చెప్పగలరా?

2. అంతర్జాతీయ న్యాయస్థానము లేక 'ఇంటర్నేషనల్ కోర్ట్ అఫ్ జస్టిస్' ఎక్కడ వుంది?

3. మన దేశంలో అంతరిక్షంలోకి ప్రయోగాలు జరిపేందుకు అనువైన రాకెట్ లాంచింగ్ కేంద్రం ఎక్కడ వుందో చెప్పగలరా?

4. ప్రపంచంలో కల్లా అత్యంత శక్తివంతమైనదీ, పెద్దదీ అయిన దూరదర్శిని ఎక్కడ వుంది?

5. ప్రపంచంలోకల్లా విశాలమైన నగరం ఏది? ఎక్కడుంది?

6. సిక్కిం, రాజస్థాన్, నాగాలాండ్, జమ్ము–కాశ్మీర్, గుజరాత్ రాష్ట్రాల ముఖ్య మంత్రులు ఎవరు?

7. మన దేశంలో బాల్య వివాహాలు–సతీ సహగమనం మునుపు ముమ్మరంగా జరిగేవి. అయితే సతీసహగమనం బ్రిటిషు వారు వుండగానే నిషేధించబడింది. అది ఏ సంవత్సరంలో జరిగిందో చెప్పగలరా?

8. ఈ రోజుల్లో ఫౌంటెన్ పెన్నులే కాకుండా బాల్‌పాయింట్ పెన్నులు కూడా విరివిగా ఉపయోగించబడుతున్నాయి. మరి ఈ బాల్‌పాయింట్ పెన్నుని కని పెట్టిన వ్యక్తి ఎవరు?

9. తుమ్మెద గానీ, తేనెటీగ గానీ మన పక్కనుంచి వెళుతూ వుంటే ఝుంకారం చేస్తున్నట్లుగా వుంటుంది. అవి అలా ఎందుకు చేస్తాయో చెప్పగలరా?

10. వేసవి కాలంలో దిన పత్రికలలో మనం ముందుగా చూసేది అంతకు క్రితం రోజు ఉష్ణోగ్రత ఎంత వున్నదీ అని. ఈ ఉష్ణోగ్రతతో పాటే గాలిలో ఆవిరి లేక తేమ ఎంత వుందో తెలియజేసే పట్టిక కూడా వేస్తూ వుంటారు. దీనినే హ్యూమిడిటి అంటారు. ఈ హ్యూమిడిటికీ ఎండ తీవ్రతకి గల సంబంధం ఏమిటో చెప్పగలరా?

[సమాధానాలు ఈ సంచికలోనే వున్నాయి. వెతికి మీ సమాధానాలతో సరిపోతాయేమో పోల్చి చూసుకోండి]

లోకి ఆహ్వానిస్తున్న బోసుని వంచించి తన దౌర్భాగ్యాన్ని అతనికి కూడా పంచాలా? భర్తని వదిలేసి వచ్చినదాన్ని పెళ్ళాడినందుకే సంఘం నుంచి ఎన్నో అవహేళనల్ని ఎదుర్కోవలసిన బోసునీ మనస్తాపానికి కూడా గురిచేయడం న్యాయమా?

వద్దు వద్దు తన దురదృష్టం తనకే పరిమితం కావాలి. తన దుఃఖం బోసును ముంచేయకూడదు. భార్యా పిల్లలతో లక్షణంగా, ఆనందంగా సంసార జీవితాన్ని గడపవలసిన బోసుని తనతో పాటు నిస్సారంగా బ్రతకమనడం అమానుషం.

కాని....బోసును కూడా దూరం చేసుకుంటే ఎలా బ్రతుకుతుంది తను? కష్టాలూ, కన్నీళ్ళూ తప్ప తన వెంట ఎవరుంటారు? ధైర్యంగా బ్రతుకుదామనుకన్న తనలో ధైర్యాన్నెవరు నింపుతారు? ఎవరు తన కన్నీళ్ళను తుడిచి కళ్ళల్లో పెట్టుకుంటారు?

ఎడతెగని ఆలోచనలతో, మానసిక సంఘర్షణలో కణతలు పగిలిపోతున్నట్లు, గుండె నెవరో పటకారుతో నొక్కేస్తున్నట్లు అనిపించి డాక్టర్ దగ్గరికి వెళ్ళింది హేమంతి. మొన్న విచారంగా, జాలిగా చూస్తూ తనను సాగనంపిన డాక్టర్ ముఖం యిప్పుడు తనను చూడగానే విప్పారి, నవ్వుతూ ఆహ్వానించడం ఆశ్చర్యాన్ని కలిగించింది.

"కమాన్! కమాన్! నిన్ను కలవడమెలాగా అని ఆలోచిస్తున్నాను. మొన్నటి నుంచి నీకో గుడ్ న్యూస్" డాక్టర్ మాటలు విని పేలవంగా నవ్వింది హేమంతి. తనకు గుడ్ న్యూసా? నవ్వొస్తూంది డాక్టర్ అమాయకత్వానికి. తనలాంటి వాళ్ళకు గుడ్‌న్యూస్ లుండవు - అన్నీ బాడ్ న్యూసే.

"మొన్నా షాకింగ్ న్యూస్ నీకు చెప్పి, పంపినప్పుడిలా ఇంత సంతోష వార్తను నీకు చెప్ప గలనని తెలియదు. ఇట్స్ రియల్లీ సర్‌ప్రైజింగ్ అండ్ ఫెంటాస్టిక్" డ్రాయర్ తెరిచి, న్యూస్ పేపర్ తీసి, మార్క్ చేసింది చదవమని హేమంతికిచ్చింది డాక్టరు. నిరాసక్తంగా చదవడం మొదలు పెట్టిన హేమంతి కళ్ళు వెడల్పుగా అయ్యాయి. గుండె ఒక్కసారిగా వేగాన్నందుకుని జోరుగా కొట్టుకుంటూంది అబగా ఒక్క ఊపున చదివేసింది.

ఇది నిజమేనా? సైన్స్ ఇంత అభివృద్ధిని సాధించిందా? అండవాహికలు దెబ్బతిన్న స్త్రీలు యిక మీదట నిస్సంతుగా, నిస్సారంగా జీవితాన్ని గడపఖర్లేదు. 'లాప్రోస్కోపీ' ద్వారా అండాన్ని వెలికిదీసి టెస్ట్ ట్యూబ్‌లో అత్యంత ఆధునికమైన, సున్నితమైన పరికరాల సహాయంతో స్పెర్మ్‌తో ఫలదీకరణ చేసి దానిని గర్భకోశంలో ప్రవేశ పెట్టారు. అప్పటివరకు ఇంజక్షన్స్ ద్వారా పిండం పెరిగేందు కనువైన వాతావరణాన్ని గర్భకోశంలో సృష్టించి, లోన ప్రవేశపెట్టబడిన పిండం నవ మాసాలూ సక్రమంగా పెరిగేలా యింజక్షన్స్ చేసారు. పిండం పూర్తిగా పెరిగాక సిజేరియన్ ఆపరేషన్ చేసి శిశువుని వెలికిదీసి వైద్య రంగంలో, శాస్త్రరంగంలో చరిత్రను సృష్టించారు. అపూర్వమైన యీ ప్రయోగం సైన్సు సాధించిన గొప్ప విజయం.

"ఈనాడు డాక్టర్లు సాధించిన యీ విజయం పరమాద్భుతం. వాళ్ళు సృష్టించిన వెలుగు త్వరలోనే మనదాకా వస్తుంది. ఇప్పుడిది విచిత్రంగా వుండొచ్చు. యిలా పుట్టిన శిశువు శారీరకంగా, మానసికంగా సహజంగా వుంటాడా అన్న అనుమానమూ వుండొచ్చు. కాని....నీలాంటి వాళ్ళ కోరిక తీరేలా అతి త్వరలో వైద్యరంగం పూర్తి సత్ఫలితాల్ని సాధిస్తుందని నమ్మకముంది నాకు. నువ్వు బిడ్డ నెత్తుకునే రోజుని చూస్తాన్నేను" ఆశ, విశ్వాసం, కరుణ పొరాడుతున్నాయి డాక్టర్ కళ్ళల్లో.

హేమంతి కళ్ళలో వెలుగు వెన్నెల జల్లులు జల్లులుగా కురుస్తూంది. □